సాక్షి అనకాపల్లి
గురువారం । 7 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

అన్ని పార్టీల సహకారంతో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: వివిధ రాజకీయ పార్టీల సహకారంతో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ జరుగుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) బి.దయానిధి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ వరకు 16,007 ఫారం–7, 22,726 ఫారం–8 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటి పరిశీలన సమయంలో కూడా బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం అందించేలా చూడాలని రాజకీయ పార్టీలను కోరారు. సమావేశంలో బి.సంతోష్(కాంగ్రెస్), కె.హరినాథ్‌బాబు(ఆప్), ఎస్‌వీవీ రామచంద్ర రావు(బీఎస్పీ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, ఎస్‌ఏ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో యువరాజ్ పర్యటన

జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు డాక్టర్ ఎస్.యువరాజ్ జిల్లాలో గురువారం పర్యటించనున్నట్లు డీఆర్వో బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశమవుతారన్నారు. 11 నుంచి 12 గంటల వరకు ఈఆర్వోలతో సమావేశం ఉంటుందన్నారు. అనంతరం ఆయన క్షేత్ర స్థాయిలో పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

జాతీయ క్రీడల్లో మహిళా ఏఎస్‌ఐ ప్రతిభ



సీసీఎస్ ఏఎస్‌ఐ అనురాధను అభినందిస్తున్న సీపీ రవిశంకర్

అల్లిపురం (విశాఖ): హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 9వ నేషనల్ గేమ్స్–2023లో పాల్గొని పతకాలు సాధించిన సీసీఎస్ పోలీస్ స్టేషన్ మహిళా ఏఎస్‌ఐ బి.అనురాధను సీపీ ఎ.రవిశంకర్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. పవర్ లిఫ్టింగ్ 50+ కేటగిరీ, డిస్కస్ త్రోలో బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో వెండి, షాట్‌పుట్‌లో కాంస్య పతకాలను ఆమె సాధించారు. వచ్చే ఏడాది గోవాలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలకు అనురాధ అర్హత సాధించారు. ఈ మేరకు సీపీ ఆమెను అభినందించారు. సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ.. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్‌లో అనురాధ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు ట్రావెల్, డైట్ ఫండ్‌లను స్పెషల్ ఫండ్ రూపంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు.

బాక్సింగ్‌లో హోంగార్డుకు గోల్డ్‌మెడల్



బీచ్‌రోడ్డు (విశాఖ): హిమాచల్‌ప్రదేశ్‌లో గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగిన 9వ నేషనల్ గేమ్స్‌లో కిక్ బాక్సింగ్ పోటీల్లో మూడో పట్టణ ట్రాఫిక్ హోంగార్డు రమేష్ గోల్డ్‌మెడల్ సాధించారు. హెవీ వెయిట్ కేటగిరిలో రమేష్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఆయన్ని సహచరులు అభినందించారు.

గౌహతి–బెంగళూరు మధ్య ఒన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గౌహతి–బెంగళూరు మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గౌహతి–బెంగళూరు(05670) వన్ వే స్పెషల్ గౌహతిలో ఈ నెల 9వ తేదీన ఉదయం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు 11వ తేదీ ఉదయం 9.10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 1–థర్డ్ ఏసీ, 7 స్లీపర్ క్లాస్, 8–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.

- ఈ నెల 7వ తేదీన హౌరాలో బయల్దేరాల్సిన హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.



పెద్దేరు జలాశయం 3 ప్రధాన గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం



రోలుగుంట మండలం బందారు వీధిలో ఇళ్లలోకి వచ్చిన నీరు



ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులో నీటమునిగిన కాలనీ నుంచి పునరావాస కేంద్రానికి వృద్ధురాలిని తరలిస్తున్న దృశ్యం



నక్కపల్లి వద్ద జాతీయ రహదారిపై చేరిన వరదనీటిని తొలగించే పనులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

సత్వర సాయమే లక్ష్యంగా..

- జడి వానలో జోరుగా పునరుద్ధరణ చర్యలు
- తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు
- సీఎం ఆదేశాల మేరకు వర్షాలతో ఇళ్లు దెబ్బతిన్న వారికి తక్షణ సాయం
- జిల్లాలో 32,091 ఎకరాల వరి పంటపై తుపాను ప్రభావం
- ముందస్తు అప్రమత్తతతో తప్పిన ప్రాణ, ఆస్తినష్టాలు
- బుచ్చెయ్యపేటలో అత్యధికంగా 8.7 సెం.మీ వర్షపాతం

జిల్లాలో వర్షపాతం

మండలం	సెం.మీ	మండలం	సెం.మీ
బుచ్చెయ్యపేట	8.7	పరవాడ	4.9
యలమంచిలి	7.8	పాయకరావుపేట	4.3
కశింకోట	6.6	రావికమతం	3.9
ఎస్.రాయవరం	6.4	మాడుగుల	3.4
నర్సీపట్నం	6.1	అనకాపల్లి	3.2
చోడవరం	6.1	అచ్యుతాపురం	2.6
రోలుగుంట	5.9	రాంబిల్లి	1.9
దేవరాపల్లి	5.8	మునగపాక	1.1

సాక్షి, అనకాపల్లి: మిచాంగ్ తుపాను తీరాన్ని దాటాక కూడా జిల్లాలో వర్షం కొనసాగింది. మంగళవారంతో పోలిస్తే వర్షపాతం తక్కువైనా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటితో బుధవారం వాగులు, వంకలు ఉధృతరూపం దాల్చాయి. అయితే అధికారుల ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది. బుధవారం జిల్లాలో అత్యధికంగా బుచ్చెయ్యపేట మండలంలో 8.7 సెం.మీ వర్షం కురిసింది. పెద్దేరు జలాశయంలోకి 4 వేల క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీటిని 3 ప్రధాన గేట్ల ద్వారా పెద్దేరు నదిలోకి విడుదల చేస్తున్నారు. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తక్షణ సూచనలు అందిస్తున్నారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

12 మండలాలపై ప్రభావం

జిల్లాలో వర్షాలు జోరుగా కురిసినా ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించగలిగామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. అధికారులు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల కృషితో ఇది సాధ్యమైందన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 32,091 ఎకరాల వరి పంటపై తుపాను ప్రభావం కనిపించిందన్నారు. సీఎం ఆదేశాల మేరకు తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నాలుగు జెర్సీ ఆవులు చనిపోయినట్లు గుర్తించామని, 25 ఇళ్లు దెబ్బతిన్నాయని, 86 పూరిళ్లు పాక్షికంగా నష్టపోయాయన్నారు. 409 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని, 54 వైద్యశిబిరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుపాను ప్రభావం కనిపించిన 32,091 ఎకరాల్లో 12,566 ఎకరాలు నీటమునిగాయని, నేలకొరిగినవి 18,935, మిగతా 590 ఎకరాల్లో పనలు నీటితో నిండిపోయాయన్నారు. 535 ఎకరాల్లో ఉద్యానపంటలపై తుపాను ప్రభావం కనిపించిందన్నారు. విద్యుత్ శాఖలో రూ.21 లక్షల విలువైన ఫీడర్లు, సబ్‌స్టేషన్లు, 38 విద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామన్నారు. వీటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించామన్నారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవడం జరిగిందని, వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై వైద్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

- బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరానికి చెందిన ఇద్దరు యువకులు దేవర అప్పారావు, గడదాసు ఈశ్వరరావు పొలాలకు వెళ్లి ఊటగెడ్డలో నుండి ఇంటికొస్తూ.. నీటి ఉధృతికి కొట్టుకుపోతుండగా స్థానికులు వెంటనే తాళ్లు వేసి ఇద్దరి యువకుల్ని రక్షించారు.
- మాడుగుల మండలంలో గాదిరాయి, పంట చెరువు, వొమ్మలి సవడ చెరువులు, వీజేపురం వద్ద గౌరిగెడ్డలకు గండి పడడంతో పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. జెడ్పీ సీఈవో పోలినాయుడు, తహసీల్దార్ పీవీరత్నం గండ్లకు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు.



వడ్డాదిలో డైవర్షన్ రోడ్డు మునిగి వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

స్వయంభూ వినాయకుడికీ తప్పని ముంపు

చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం గర్భగుడిలోకి వర్షపు ఊటనీరు చేరింది. గత నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏనుగుబోదు చెరువు నిండిపోవడంతో ఊటనీరు ఆలయంలోకి వచ్చి స్వామివారి మూలవిరాట్‌ను ముంచింది. ముంపు నీరును బయటకు తోడేందుకు ఆలయ వర్గాలు చర్యలు చేపట్టాయి.



బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో గెడ్డలో కొట్టుకుపోతున్న యువకులు.. వీరిని స్థానికులు రక్షించారు

అధికారుల సేవలకు ప్రశంసలు



సారిపల్లిపాలెంలో పూరి గుడిసె నుంచి వృద్ధురాలిని రక్షిస్తున్న ఎస్‌ఐ విభీషణ్‌రావు

నక్కపల్లి: తుపానులో నక్కపల్లి మండలంలో ఇద్దరు అధికారులు బుధవారం స్పందించిన తీరు పలువురి ప్రశంసలందుకుంది. రావులచెరువుకు గండి పడి వీవర్స్‌కాలనీలోకి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉపసర్పంచ్ వీసం రాజు నీటిలోకి దిగి నీటి ప్రవాహం కాలనీకి చేరకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. సారిపల్లిపాలెంలో కళ్లు కనపడక పూరిగుడిసెలో వర్షపునీటిలో చిక్కుకుపోయిన వృద్ధురాలు కె.మహాలక్ష్మిని స్థానిక ఎస్‌ఐ విభీషణ్‌రావు గుర్తించి అతికష్టం మీద నేలమట్టానికి ఉన్న పూరి గుడిసెలో దూరి వృద్ధురాలిని కాపాడారు. బయటకు తీసుకు వచ్చి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

సమన్వయంతో అండగా నిలవాలి



- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అధికార్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, తుపాను బాధితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలం తారువలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికార్లు, ప్రజా ప్రతినిధులతో ఫోన్ ద్వారా తుపాను పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వాతావరణ కేంద్రం సూచనల మేరకు మరింత వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యాన్ని ఆఫ్‌లైన్లో కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. సీఎం జగన్ నిరంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి తుపాను ప్రభావాన్ని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

సహాయ కార్యక్రమాలు ముమ్మరం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంకు వివరించిన కలెక్టర్

సాక్షి, అనకాపల్లి: తుపాను సహాయ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి జిల్లా నుంచి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాపై తుపాను ప్రభావం, తీసుకున్న ముందస్తు చర్యలు, బాధితులకు అందుతున్న సహాయ చర్యలను కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ సాయం అందరికీ అందాలని ముఖ్యమంత్రి చెప్పారు. తుపాను కారణంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు తక్షణ సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు.

అప్రమత్తత కొనసాగాలి

తుమ్మపాల: తుపాను ప్రభావంపై గురువారం వరకు అప్రమత్తంగా ఉండాలని, సహాయ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో బుధవారం వెబ్‌ఎక్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల వారికి పరిస్థితిని వివరించి శిబిరాలకు చేర్చాలన్నారు.

శిబిరాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు, నాణ్యమైన భోజనాలు అందాలన్నారు. పూర్తిగా వరద ప్రభావం తగ్గిన తరువాతే వారిని ఇంటికి పంపించాలని ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గిన తర్వాత కార్డు ఉన్నా, లేకపోయినా అందరికీ రేషన్ అందజేయాలని ఆదేశించారు.



మాకవరపాలెంలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సురక్షిత ప్రాంతాలకు తరలించండి

- వరద బాధితుల భద్రతకు ప్రత్యేక చర్యలు
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం–కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నక్కపల్లి: వరద బాధితులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. తుపాను కారణంగా నీట మునిగిన నక్కపల్లి వీవర్స్ కాలనీని బుధవారం ఆయన సందర్శించారు. రావుల చెరువుకు గండి పడటంతో కాలనీ నీట మునిగిందని వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తహసీల్దార్ అంబేద్కర్‌లు కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీ వారి సాయంతో సహాయక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను తీవ్ర ప్రభావంతో నష్టం వాటిల్లే ప్రాంతాలను గుర్తించి, అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పంట పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపి, వరి పంటను కాపాడుకోవడం వంటి సహాయక చర్యలపై వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జయరాం, డీఎల్‌పీవో మూర్తి, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



నక్కపల్లిలో నీట మునిగిన వీవర్స్‌కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

వరద ముప్పు తగ్గే వరకు..

ఎస్.రాయవరం/యలమంచిలి (అనకాపల్లి రూరల్) : వరద నీటి సమస్య తగ్గే వరకు అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. ఎస్.రాయవరంలోని పెనుగొల్లు ధర్మవరం వద్ద నీట మునిగిన కాలనీని, దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. నీట మునిగిన కాలనీల్లో ఎవరూ ఉండకుండా స్థానికుల సాయంతో పునరావాస కేంద్రాలకు తరలించాల్సిందిగా అధికారుల్ని సూచించారు. అనంతరం ఆయన యలమంచిలి పట్టణంలో పర్యటించి, శేషుగెడ్డ వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలిచ్చారు.

జలాశయాలపై ప్రత్యేక పర్యవేక్షణ

- తుపానుపై ఇరిగేషన్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం
- రైవాడ జలాశయ పరిశీలనలో ఇరిగేషన్ జిల్లా అధికారి త్రినాథం


దేవరాపల్లి/మాడుగుల: జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావం నేపథ్యంలో తమ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు జిల్లా జలవనరుల శాఖ ఇన్‌చార్జి అధికారి ఎ.త్రినాథం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైవాడ జలాశయాన్ని స్థానిక డీఈ జి.సత్యంనాయుడుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. జలాశయంలో నీటి నిల్వల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరద తీవ్రతతో పాటు జలాశయాలు, చెరువుల స్థితిని ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందిస్తున్నామన్నారు. జలాశయాల వద్ద డీఈలతో పాటు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఆయన రైవాడ జలాశయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అల్లూరి జిల్లా అనంతగిరి, ముంచంగిపుట్టు, పాడేరు కొండల్లో కురిసే వర్షాల ఆధారంగా మన జిల్లాలోని జలాశయాల్లో వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. పెద్దేరు జలాశయం మాత్రమే ప్రమాద స్థాయికి చేరుకోవడంతో 3 ప్రధాన గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. తారకరామ జలాశయంలోకి చేరుతున్న వరద నీటిని తాచేరు నదిలోకి విడిచిపెడుతున్నట్లు వెల్లడించారు. జలాశయాల పరివాహక ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తమ పరిధిలో 3వేల చెరువులు ఉన్నాయని, ప్రస్తుతం అన్ని చెరువుల్లో వర్షపు నీరు చేరుతోందన్నారు. ఎక్కడా చెరువులకు ముప్పు వాటిల్లలేదని పేర్కొన్నారు. పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, గౌరిగెడ్డలు వారం రోజులపాటు ఉధృతంగా ప్రవహిస్తాయని, ప్రజలు నదులలో దిగరాదని తహసీల్దార్ పీవీ రత్నం హెచ్చరించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా జలవనరుల శాఖ ఇన్‌చార్జి అధికారి త్రినాథం

దార్శనికుడు అంబేడ్కర్

తుమ్మపాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ భారతీయ సమాజానికి దార్శనికుడని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కొనియాడారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావేత్తగా రాజ్యాంగ నిర్మాతగా, న్యాయవాదిగా, సామాజిక సంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన దేశానికి అనేక రూపాల్లో సేవలందించారన్నారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడన్నారు. సమస్యలను ఎదిరించాలంటే చదువొక్కటే మార్గమని భావించారన్నారు. స్వతంత్ర భారతావనికి తొలి న్యాయశాఖ మంత్రిగా అమూల్యమైన సేవలు అందించారని, అంబేడ్కర్ కలలు కన్న సమసమాజ నిర్మాణానికి మన వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ఈ కార్యక్రమంలో డీఆర్వో బి. దయానిధి, సీపీవో జి.రామారావు, సోషల్ వెల్ఫేర్ డీడీ అజయ్‌బాబు, డీవీఎంసీ మెంబర్ బి.అప్పారావు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి టౌన్: అంబేడ్కర్ ఆశయసాధనకు నేటి యువత కృషి చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవిత లక్ష్యాలను సాధించే దిశగా పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపునాయుడు, ఎస్‌ఐలు రఘువర్మ, వెంకన్న పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

రోడ్డు ప్రమాదాల్లో టీచర్ సహా ఇద్దరి మృతి



కశింకోట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శిరీష జ్యోతి



శిరీష జ్యోతి (ఫైల్)



ఒమ్మి శ్రీను

కశింకోట: మండలంలోని జాతీయ రహదారిపై వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. కశింకోట శివారులోని బంకు వద్ద అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న స్కూటీని గుర్తు తెలియని లారీ ఢీకొంది. దీంతో స్కూటీ నడుపుతున్న అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన టీచర్ సేనాపతి శిరీషజ్యోతి(26) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీ వెనుక కూర్చున్న కర్రి భాగ్యశ్రీకి గాయాలవడంతో, ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. జ్యోతి స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్నారు. స్కూల్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద స్థలాన్ని సిఐ ఎ.రవికుమార్ సందర్శించారు.

మండలంలోని బయ్యవరం వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో సిమెంట్ పరిశ్రమలో పని చేస్తున్న ఒమ్మి శ్రీను(43) మృతి చెందాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని తన స్వగ్రామం జమాదులపాలెం వెళుతుండగా అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న ప్రైవేట్ బస్సు వెనుకగా వచ్చి ఢీకొంది. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ శాఖకు రూ.25 లక్షల నష్టం

- వెనువెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



పెదబొడ్డేపల్లిలో విరిగిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

నర్సీపట్నం: తుఫాన్ ప్రభావంతో నర్సీపట్నం విద్యుత్ సబ్ విడిజన్‌లో రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. తుఫాన్‌కు దెబ్బతిన్న విద్యుత్ సబ్ స్టేషన్లను, విరిగిపడిన స్తంభాలను ఆయన నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో 13 మండలాల్లోని 36 సబ్ స్టేషన్లకుగాను 11 సబ్ స్టేషన్లలో ఇబ్బందులు తలెత్తడంతో 185 గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. కేవీ పోల్స్ -11, ఎల్‌టీ పోల్స్ -32, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టి 185 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. విద్యుత్ కనెక్షన్లను కొన్నింటిని పునరుద్ధరణ చర్యలు తీసుకున్నామన్నారు. మిగిలినవి గురువారం నాటికి పునరుద్ధరించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు ఈ నెల 15

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరిలో నిర్వహించే పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు హాజరయ్యేవారు ఈ నెల 15లోగా ఫీజులు చెల్లించవచ్చు. అలాగే ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



యలమంచిలి పట్టణంలో శేషుగెడ్డ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కోటవురట్లలో పరిస్థితిని సమీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



కోటవురట్లలో పరిస్థితిని సమీక్షిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం



మాడుగుల మండలంలో వరద ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు



చోడవరంలో నీట మునిగిన విఘ్నేశ్వరుడు

జలదిగ్బంధంలో కోటవురట్ల

కోటవురట్ల: భారీ వర్షాలకు మండల కేంద్రమైన కోటవురట్ల మంజలదిగ్బంధంలో చిక్కుకుంది. కోటవురట్లలోని తుపాకుల గెడ్డ, కైలాసపట్నంలోని గోవాడ గెడ్డ, జల్లూరులోని దుగ్గాడ కాలువ, లింగాపురంలోని కొండగెడ్డ, వరాహనది పొంగి ప్రవహిస్తున్నాయి. కొండ గెడ్డ గ్రామంలోకి చేరడంతో లింగాపురం వాసులు భయాందోళన చెందారు. కొడవటిపూడిలో గెడ్డ ఉగ్రరూపం దాల్చింది. కోదండరాంపురానికి వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. వరాహనది తీరం వెంబడి గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కోటవురట్లలో డ్రైనేజీలు పూడుకుపోవడంతో వర్షపునీరు మెయిన్ రోడ్డును ముంచెత్తింది. పొక్లెయిన్‌తో పూడిక తీసి నీరు గెడ్డలోకి పోయేలా చర్యలు తీసుకున్నారు. చిన బొడ్డేపల్లి, లింగాపురం, జల్లూరు, కైలాసపట్నం, రామచంద్రపురం, గొట్టివాడ, రాజుపేట, కోటవురట్ల, తంగేడు, యండపల్లి ప్రాంతాలలో సుమారు 1500 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కొడవటిపూడి, కె.వెంకటాపురరం, చౌడువాడ, రాజుపేట గ్రామాలలో వరి కుప్పలు పూర్తిగా నీట మునిగాయి. కోటవుటర్లలో పరిస్థితి మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు సమీక్షించారు. ఆర్డీవో జయరాం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

క్షేత్ర పరిశీలన చేసిన జెడ్పీ సీఈవో

మాడుగుల: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఖరీఫ్ వరి పంట నీట ముంపునకు గురవ్వడంతో జెడ్పీ సీఈవో పోలినాయుడుతోపాటు వ్యవసాయధికారులు మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించారు. పొలాల్లో పంట నష్టం అంచనా వేశారు. మూడు రోజులుగా 194 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 1,842 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని ఏవో వాసుదేవరావు తెలిపారు. తహసీల్దార్ పీవీ రత్నం, వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.



లింగాపురంలో పొంగి ప్రవహిస్తున్న కొండగెడ్డ నీరు

గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు

ఉధృతంగా ప్రవహిస్తున్న లువ్వాగెడ్డ





గల్లంతైన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, కుమార్

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రం సమీపంలోగల లువ్వా గెడ్డ వద్ద బుధవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురి కోసం చీకటి పడేవరకు గాలింపు చర్యలు కొనసాగాయి. ఈ ఘటనలో సీతపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గెమ్మెల లక్ష్మీ(50), మిరియాల కమల(40), గెమ్మెల కుమార్(25) గల్లంతయ్యారు. గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నందున పూర్తిస్థాయిలో గాలింపు చర్యలకు పరిస్థితులు అనుకూలించడం లేదు.తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఎంపీటీసీ అశోక్, సర్పంచ్ భీమ్మలమ్మ ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశామని, గురువారం ఉదయం మళ్లీ కొనసాగిస్తామని ఎస్ఐ కరక రాము తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న లువ్వా గెడ్డ



లువ్వాగెడ్డ చేరుకున్న రెస్క్యూ బృందం సభ్యులు

పాడేరు ఘాట్‌లో రాకపోకలకు అంతరాయం

సాక్షి, పాడేరు: భారీ వర్షాల కారణంగా పాడేరు ఘాట్‌లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. కొండవాగుల నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల రాకపోకలను ముందస్తుగానే నిలిపివేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పోలీసుశాఖకు ఆదేశాలిచ్చారు. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి ఘాట్‌లో ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. మైదాన ప్రాంతాల నుంచి పాడేరు వచ్చే వాహనాలను ఘాట్ దిగువున ఉన్న తాటిపర్తి ఎస్ఈబీ చెక్‌పోస్టు వద్ద ఆపేశారు. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనాలను పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. కొండచరియలు జారిపడుతున్న ప్రాంతాలను బుధవారం సాయంత్రం ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, సిబ్బంది పరిశీలించారు. గురువారం ఉదయం నుంచి తొలగింపు పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ, పోలీసుశాఖ కార్యాచరణ రూపొందించాయి.

కేకే లైన్‌లో పునరుద్ధరణ పనుల పూర్తి

తాటిచెట్లపాలెం (విశాఖ)/అనంతగిరి: కేకే లైన్‌లో తైడ-శివలింగపురం సెక్షన్ మధ్య రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన కొండచరియలను తొలగించి గూడ్స్ రైళ్ల రాకపోకలను బుధవారం పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కొండచరియలు విరిగిపడగా వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, సీనియర్ అధికారులతో కలిసి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం, కోరాపుట్, అరకు నుంచి యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, సిబ్బందిని రప్పించి మంగళవారం రాత్రంతా పునరుద్ధరణ పనులు చేపట్టారు. ట్రాక్‌లపై నుంచి బండరాళ్లు తొలగించి గూడ్స్ రైళ్ల రాకపోకలను బుధవారం ఉదయం 9.30 గంటలకు పునరుద్ధరించారు.

ఈ ప్రాంతంలో లైన్ క్లియర్ చేసినప్పటికి, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అప్పటికే అరకు చేరుకున్న కిరండూల్-విశాఖపట్నం(08552) రైలులో ఉన్న సుమారు 199 మంది ప్రయాణికులను మూడు ప్రత్యేక బస్సుల్లో విశాఖపట్నం తరలించారు.



కేకే లైన్లో పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్

రద్దయిన రైళ్లు

బుధవారం రాత్రి విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్, గురువారం రాత్రి కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7వ తేదీన విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్, ఈ నెల 8వ తేదీ కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.

హోంగార్డుల సేవలు శ్లాఘనీయం

- ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: హోంగార్డుల సేవలు శ్లాఘనీయమని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాలులో బుధవారం హోంగార్డు రైజింగ్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డులు విధి నిర్వహణలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైం తదితర విధుల్లో కానిస్టేబుళ్లతో సమానంగా పనిచేస్తూ పోలీసు శాఖలో ముఖ్యభూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. గంజాయి రవాణా, సారా, లా అండ్ ఆర్డర్ కేసులు, చోరీ కేసుల్లో ప్రతిభకనబరిచిన ఆరుగురు హోంగార్డులు ఆర్.రాంబాబు, బాబా షేక్ ముస్కిన్ మదీనా, పి.ఈశ్వరరావు, ఎన్.పైడంనాయుడు, బి.త్రినాథరావు, ఎస్.సన్నిబాబులకు ఆయన ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీ వి.సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు సతీష్, రామకృష్ణారావు, వెంకటరావు, కోటేశ్వరబాబు, పట్టణ సీఐ మోహన్‌రావు, ఎస్ఐలు సింహాచలం, సత్యనారాయణ, ఆదినారాయణ, హోంగార్డులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

పతాక దినోత్సవ నిధికి విరాళాలివ్వండి

- కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల: స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి నేటి వరకు సాయుధ దళాలు దేశం లోపల, వెలుపల ఎన్నో సవాళ్లను ఎదుర్కొని వీరోచితమైన సేవలు అందిస్తూ దేశ రక్షణకు ఎంతగానో శ్రమిస్తున్నాయని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి తెలిపారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానులపై ఆధారపడిన వారి సంక్షేమం కోసం విరాళాలు అందించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. మాజీ సైనికులు, వితంతువుల సంక్షేమం కోసం ఈనెల 7న నిర్వహిస్తున్న సాయుధ దళాల పతాక దినోత్సవానికి అందరూ సహాయం అందించాలని పేర్కొన్నారు. పతాక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు, విద్యా సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, వాణిజ్య సంస్థలు, సినిమా థియేటర్ల యజమానులు భారీగా విరాళాలు ఇవ్వాలని కోరారు. మన దేశ రక్షణలో తుది శ్వాస విడిచిన వీర జవానుల కుటుంబాల సంక్షేమానికి, మాజీ సైనికుల సంక్షేమానికి, వారి పునరావాసానికి ఈ విరాళాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సంచాలకులు, సైనిక సంక్షేమ శాఖ (ఆంధ్రప్రదేశ్), మొగల్రాజపురం, విజయవాడ పేరిట డీడీ రూపంలో గాని, ఈసీఎస్. ద్వారా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజీ రోడ్డు, విజయవాడ అకౌంట్ నంబర్.33881128795, ఎస్‌బీఐ ఎన్0016857 పంపుతూ జిల్లా సైనిక సంక్షేమాధికారి, విశాఖపట్నం వారికి తెలియజేయాలని కోరారు. ఈ విరాళాలకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సింధియా: భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) ఆధ్వర్యంలో సీడాప్, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న 21 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు బీఈ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ప్రొడక్ట్ డిజైన్ ఇంజినీర్ - మెకానికల్ (30 సీట్లు) మెకాట్రానిక్స్ డిజైనర్ అండ్ సిస్టమ్ ఇంటిగ్రేటర్ ఇంజినీర్ కోర్సుల్లో 3 నుంచి 5 నెలలపాటు వసతి కల్పించి, ఉచిత శిక్షణ అందిస్తారు. అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీ కృష్ణ శివ్వం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు విశాఖపట్నం సింధియా జంక్షన్‌లో ఉన్న సెమ్స్ కేంద్రంలో, 9948183865, 8500687750, 0891- 2704010లో సంప్రదించి, డిసెంబర్ 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

11న సినీ నటుడు ఎల్బీ శ్రీరామ్‌తో ముఖాముఖి

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన డాబాగార్డెన్స్‌లో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ నటుడు ఎల్బీ శ్రీరామ్‌తో ముఖాముఖీ నిర్వహించనున్నామని సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా లఘు చిత్రాల నిర్మాణం, వాటి పోకడలు అనే అంశంపై అవగాహన కల్పించనున్నామన్నారు. నటుడు మిశ్రో పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

సింహగిరిపై వర్తకుడి నిజాయితీ

భక్తురాలు పోగొట్టుకున్న నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల దండ లాకెట్ అప్పగింత



భక్తురాలు వెంకటరత్నంకి బంగారు లాకెట్ అందజేస్తున్న వర్తకుడు మదన్

సింహాచలం: భక్తురాలు పోగొట్టుకున్న నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల దండ లాకెట్‌ని తిరిగిచ్చి సింహగిరికి చెందిన వర్తకుడు నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే... విజయనగరం ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న తెర్ల వెంకటరత్నం బొబ్బిలిలోని వెలమపేటలో ఉంటున్నారు. ఈ నెల 5న కుటుంబ సభ్యులతో కలిసి వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి వచ్చారు. అక్కడ తన సోదరి వరలక్ష్మితో కలిసి సింహగిరి మార్కెట్‌లో ఆమె నాలుగున్నర తులాల నల్లపూసల దండ బంగారు లాకెట్ పోగొట్టుకుంది. తిరుగు ప్రయాణంలో తగరపువలస వెళ్లాక... బంగారు లాకెట్ కనిపించకపోవడంతో మళ్లీ సింహగిరికి వచ్చి వర్తకులకు విషయాన్ని తెలియజేశారు. షాప్ నంబర్-2 వర్తకుడు మదన్ వద్ద పనిచేస్తున్న నాయుడు, రోజాకు నల్లపూసల దండ లాకెట్ దొరకగా యజమానికి అప్పగించారు. సింహగిరిపై పోలీస్ అవుట్‌పోస్టు సిబ్బంది, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, కోశాధికారి దొంతల శంకర్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పైడిరాజు సమక్షంలో బుధవారం వెంకటరత్నానికి అందజేశారు.

విద్యుత్‌షాక్‌తో ఆర్టీసీ కండక్టర్ మృతి

అనకాపల్లిటౌన్: విద్యుత్ షాక్‌తో మండలంలో సిరసపల్లి గ్రామం పోర్టు కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ కె.ఎస్.రావు మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు బుధవారం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు... కె.ఎస్.రావు తమ ఇంటిలో వాటర్ మోటర్ స్విచ్‌వేసినప్పుడు విద్యుత్‌షాక్ గురై పడిపోయాడు. హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి కుటుంబ సభ్యులు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతినికి భార్య, కుమార్తె ఉన్నారు.



మృతుడు కె.ఎస్.రావు

దొంగ ఓట్లు కోసం అయ్యన్న మాట్లాడటం సిగ్గుచేటు



దొంగ ఓట్లపై ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: దొంగ ఓట్లతో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు 40 ఏళ్లగా పబ్బం గడుపుతున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. దొంగ ఓట్ల గురించి అయ్యన్నపాత్రుడు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యుల దొంగ ఓట్లపై సమగ్ర దర్యాప్తు చేసి, తొలగించాలని కోరుతూ బుధవారం ఆర్డీవో హెచ్.వి.జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విశాఖపట్నం, రోలుగుంట, బుచ్చంపేట, తూర్పుగోదావరి జిల్లా అల్లిపూడి, రౌతులపూడి ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై అయ్యన్న నర్సీపట్నం నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదు చేయించారని, వీటిపై దర్యాప్తు చేసి, తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. దొంగ ఓట్లు చేర్పించుకునే అగత్యం తమకు లేదన్నారు. అయ్యన్నపాత్రుడు సొంత చిన్నాన్న లాలం శ్రీరామ్మూర్తి విశాఖపట్నంలో స్థిరపడ్డారని, ఆయనకు నర్సీపట్నం మున్సిపాలిటీ 152 పోలింగ్ బూత్‌లో ఓటు ఉందన్నారు. శ్రీరామ్మూర్తి కుమారుడు సంతోష్‌కుమార్, కుమార్తె మాధవి 170, 162 పోలింగ్ బూత్‌ల్లో ఓట్లు ఉన్నాయన్నారు. మాధవికి విశాఖ ఈస్ట్‌లో ఓటు ఉందన్నారు. వీరంతా 30 ఏళ్లగా విశాఖలో ఉంటున్నప్పటికీ, అయ్యన్నపాత్రుడు రాజకీయ పలుకుబడితో దొంగ ఓట్లను చెలామణి చేయిస్తున్నారని మండిపడ్డారు. బీకే పల్లి ఓట్లు నర్సీపట్నంలో ఉంటే విచారణ చేసి తొలగించవచ్చన తెలిపారు. అయ్యన్నపాత్రుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

సోదరభావం పెంపొందాలి

అమెరికా భాషా శాస్త్రవేత్త మైకేల్ బ్రాన్

ఏయూక్యాంపస్: ప్రజల మధ్య సోదరభావం పెంపొందాలని అమెరికాకు చెందిన భాషా శాస్త్రవేత్త డాక్టర్ మైకేల్ బ్రాన్ అన్నారు. ఏయూ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం అమెరికన్ కార్నర్‌లో బ్రింగింగ్ బోర్డర్స్ ఫర్ ఈక్వాలిటీ అనే అంశంపై చర్చావేదిక జరిగింది. పలు దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనమంతా సమానంగానే జన్మించామనే వాస్తవాన్ని గ్రహించాలని సూచించారు. జీవించే హక్కు, సంతోషాన్ని పొందే హక్కును కలిగి ఉండాలన్నారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత మాట్లాడుతూ అంబేడ్కర్ దార్శనికతను ప్రపంచవ్యాప్తంగా యువతకు పరిచయం చేసే విధంగా ఈ కార్యక్రమం సాగిందన్నారు. ఏయూ పాలక మండలి పూర్వ సభ్యుడు డాక్టర్ పి.ఏసుపాదం మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న ప్రజల కష్టాలను తీర్చే దిశగా యువత ఆలోచన చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ అసమానతలను రూపుమాపే విధంగా రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ఆలోచనలను యువతకు వివరించారు. ఆఫ్గనిస్తాన్ విద్యార్థి అబీదుల్లా మాట్లాడుతూ భారతదేశ విజయ రహస్యం రాజ్యాంగమేనన్నారు. అనంతరం అతిథులను వర్సిటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా సూడాన్, ఘనా, బంగ్లాదేశ్, పాలస్తీనా, ఇథియోపియా, ఉగాండా తదితర దేశాలకు చెందిన విద్యార్థులు తమ ఆలోచనలు, తమ దేశంలో ఉన్న పరిస్థితులను వివరించారు.



చర్చావేదికలో పాల్గొన్న విద్యార్థులతో వీసీ సమత తదితరులు

క్లుప్తంగా

'రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి'

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జిల్లాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, అధికారులతో అంచనాలు వేయించి తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక చదువులవారివీధి బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి కేంద్రంగా జిల్లాను కరవు జిల్లాగా ప్రకటించాలన్నారు. జిల్లాలో అత్యధికంగా 10 మండలాల్లో వర్షపాతం ఎక్కువగా నమోదైందని, తడిచిన వరిని ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి వెంకట సత్యనారాయణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రవిరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కర్రి రామకృష్ణ, మూర్తి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


నీట మునిగిన వరి పనలను పరిశీలిస్తున్న సీపీఐ నేత రాజాన దొరబాబు తదితరులు

కశింకోట: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ప్రభుత్వాన్ని కోరారు. కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో తుపాను వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయంలో తుపాను తీరని వేదనను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు నరాలశెట్టి సత్యనారాయణ, ఆళ్ల అప్పలనాయుడు, వియ్యపు రాజు, బుద్ద నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయానికి వినతి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో ఉన్న సాంబమూర్తి చేనేత సంఘం కార్మికులు తమను ఆదుకోవాలంటూ తహసీల్దార్‌కు బుధవారం మొరపెట్టుకున్నారు. మిచాంగ్ తుపాను వర్షాల వల్ల మగ్గాల్లో నీరు చేరి మూడు రోజులుగా పనులు లేక 14 కుటుంబాలు జీవనోపాధి కోల్పోయినట్లు తెలిపారు. తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ సంఘం ప్రతినిధులు కె.సాంబ శివరావు, ఆంద్ర శ్రీనివాసరావు వినతి పత్రాన్ని అందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 177 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,135	4,135
రెండో రకం	3,750	3,940
మూడోరకం	3,600	3,740

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
కాలింగ్ సహస్ర	: సత్యనారాయణస్క్రీన్-1
బ్రీత్(వైద్యో నారాయణో హరి)మార్నింగ్ షో	
విక్రమ్ రాథోడ్	: సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-9 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 236 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 179 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.


పోటెత్తి ప్రవహిస్తున్న శారదానది


తాళ్లపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడివాక గెడ్డ


కశింకోట వద్ద పొంగి ప్రవహిస్తున్న శారదానది


గవరపేటలో ఒడ్డున నిలిపివేసిన దోనెలు

మిచాంగ్ బీభత్సం


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు


మార్టూరులో పంట పరిశీలనలో ఏవో రంగాచారి


శంకరంలో నీటమునిగిన వరి పంట


చింతలపాలెం వద్ద నేలకొరిగిన వరి చేను


సత్తెమ్మపేటలో ఇండ్లలోకి చేరిన వర్షపునీరు

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను బీభత్సం కొనసాగుతోంది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పంట నీటమునిగింది. 4, 5 తేదీల్లో వర్షపాతం పెద్దగా లేదు. బుధవారం మాత్రం 130.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పంట నీట మునగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల, పోలీస్ తదితర శాఖల అధికారులు మండలంలోని పలు ప్రాంతాలో పర్యటించారు. సహాయక చర్యల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. శారదానది ఉధృతంగా పారడంతో నది వద్దకు ఏవరినీ అనుమతించకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శారదానది ఒడ్డున ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు వర్షపునీరు చేరుకుంది. ఆర్టీసీ కాంప్లెలోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

అనకాపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగారావు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో 22 గ్రామాల్లో 278 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని, 485 హెక్టార్లలో వరి చేను నేలకొరిగిందని తెలిపారు. ఎప్పటికప్పుడు రైతుల సహాయంతో పంట పొలాల్లో వర్షపు నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కశింకోట: కశింకోట వద్ద శారదానది మిచాంగ్ తుపాను వర్షాలకు బుధవారం పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు అకస్మాత్తుగా వరద నీరు చేరి నీటి మట్టం భారీగా పెరిగింది. దీంతో స్థానిక గవరపేటలో తమ పొలాలకు రైతులు రాకపోకలు సాగించేందుకు వినియోగించే దోనె ప్రయాణాలను నిలిపేశారు. గ్రామ శివారులో ఉన్న వంతెన మీదుగా ఎక్కువ దూరం నడిచి వెళ్లి, వ్యవసాయ కార్యకలాపాలు సాగించుకోవాల్సి వస్తోంది.

• తాళ్లపాలెం వద్ద మామిడివాక గెడ్డ ఉరకలేస్తూ ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఒక్కసారిగా నీటి మట్టం పెరిగి పెద్ద ఏరులా కనిపిస్తోంది. దీంతో దిగువన ఉన్న ఏఎస్ పేట గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రెండుసార్లు తుపాన్ల వర్షాలకు ముంపునకు గురవడమే కాకుండా రైల్వే ట్రాక్ కూడా కొట్టుకుపోయి రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ట్రాక్ పటిష్టం చేసి, గెడ్డ నీరు శారదానదికి చేరేందుకు వీలుగా వెడల్పు చేశారు. అప్పటి నుంచి ముంపునకు గురికాలేదు. అయినా ముంపు భయం ప్రజల్ని వీడలేదు. రంగబోలు గెడ్డ, కొండ గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

• మండలంలో పండిన వరి పంటను నిలువునా ముంచాయి. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలు కావడాన్ని తట్టుకోలేకపోతున్నారు. దాదాపు వరి పంట అంతా నీటి ముంపులో ఉంది. ఈ ఏడాది 846 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. పంట పండి కోత దశకు చేరుకుంది. గత మూడు రోజులు కురిసిన వర్షాల వల్ల 528 హెక్టార్లలో పంట నేలకొరిగింది. మరో 294 హెక్టార్లలో పంట నీటి ముంపులో ఉంది. ప్రధానంగా పల్లపు ప్రాంతాలైన నూతలగుంటపాలెం, ఏనుగుతుని, సోమవరం, ఏఎస్ పేట, గొబ్బూరు, కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, పరవాడపాలెం, చింతలపాలెం, నరసింగబిల్లి, అచ్చెర్ల, తీడ, చెరకాం, అడ్డాం, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో పంట నీటి ముంపునకు గురైంది. ఈ మేరకు ప్రాథమికంగా గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న బుధవారం తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టి నీరు ఇంకిపోయే వరకు పంట ఎంత మేరకు నష్టం జరిగిందనే విషయాన్ని అంచనా వేయలేమన్నారు. గొబ్బూరు, తాళ్లపాలెం, కశింకోట, వెదురుపర్తి తదితర గ్రామాల్లో చెరకు పంట కూడా నీటి ముంపులో ఉంది.

తుమ్మపాల: మండలంలో తుపాను కారణంగా పలు గ్రామాల్లో వరి పంట నీటమునిగింది. ప్రధానంగా అనకాపల్లి ఆవఖండం, శంకరం గ్రామాల్లో పంటలు పూర్తిగా నీటమునిగాయి. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. బొజ్జన్నకొండ నుంచి అనకాపల్లి-సబ్బవరం జాతీయ రహదారి శంకరం వరకు ఏలేరు కాలువ ఎడమ గట్టుపై నుంచి నీరు పారుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గట్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఏలేరు కాలువ, పులి కాలువ మధ్యనున్న సత్తెమ్మపేట గ్రామం జలదిగ్బంధంలో ఉంది. గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మండలంలో బుధవారం ప్రభావంతో 181.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారిక సమాచారం.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


డీవీఆర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొణతాల భాస్కర్


సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధుబాబు


లక్ష్మీదేవిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రేబాక రామారావు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు.

• స్థానిక గాంధీనగరం సాంఘిక సంక్షేమశాఖ జిల్లా కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరీ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ డీడీ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

• లక్ష్మీనారాయణనగర్ డీవీఆర్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అంతంతరం అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, పార్టీ నేతలు కటారి దేముడు, యల్లపు శ్రీనివాస్, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• భీమునిగుమ్మం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పట్టణ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకుడు కటారి దేముడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, యల్లపు శ్రీనివాసరావు, బండి రాజాబాబు, పొట్ల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

• లక్ష్మీదేవిపేట అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా దళిత నాయకుడు రేబాక రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు రాము, పి.అప్పారావు, నాగరాజు, మణికిరణ్, శివ సాంబ తదితరులు పాల్గొన్నారు.

వరి, చెరకు సంరక్షణకు సూచనలు


తుమ్మపాల గ్రామంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా మండంలో వివిధ గ్రామాల్లో నీటి మునిగిన వరి పంటలను స్థానిక ప్రాంతీయ వ్యవసాయపరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరకు ప్రధాన శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, ఆర్.సరిత, డి.ఉమామహేశ్వరరావులు రైతులకు పలు సూచనలు చేశారు.

వరి పంటలో..

వరి కోతకోసి పొలంలో ఉన్న పనలు వర్షంలో తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, ఒక వేళ పొలంలో నీరు నిలిచినట్లయితే పనలను గట్లపైకి తెచ్చి, విడగొట్టిన ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలని సూచించారు. కోసిన వెంటనే పూర్తిగా ఆరని పనలను తుపాను వాతావరణం కారణంగా కుప్పలు వేసేటపుడు, ఎకరాకు 25 కిలోల ఉప్పును తగు మోతాదులో పనలపై జల్లుకుంటూ కుప్పలు వేయాలన్నారు. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరచుకోవాలని, నూర్చిన ధాన్యాన్ని 2-3 రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే గింజ మొలకెత్తడమేకాక రంగుమారి చెడువాసన వస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితిలో నష్ట నివారణకు కిలో ఉప్పునకు 2, 3 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగుపెట్టడం వల్ల గింజమొలకెత్తకుండా, పాడవకుండా జాగ్రత్త పడవచ్చన్నారు.

చెరకు పంటలో..

తాజా వర్షాలకు ముంపునకు గురైన చెరకు పొలాల్లో నీటిని వీలైనంతగా తొలగించి, పడిపోయిన తోటలను జడ చుట్లు ద్వారా నిలబెట్టాలన్నారు. నీటిని తొలగించి ఎకరాకు 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపోటుగా వేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ఒంపోలులో సంక్షేమ లబ్ధి ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు


ఉప్పవరంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న స్థానిక నాయకులు

మునగపాక/అచ్యుతాపురం(అనకాపల్లి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మునగపాక, అచ్యుతాపురం మండాలల్లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో వారు మాట్లాడారు.మునగపాక మండలంలోని ఒంపోలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్, పార్టీ నేతలు ద్వారం రామునాయుడు, వెంకట్,వెంకటప్పారావు, ఈవోఆర్డీ పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో-ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, మాజీ సర్పంచ్ చిన్ని శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు దేశంశెట్టి శంకర్‌రావు, కోన లచ్చన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో విక్రయాల జోరు


నరసింగబిల్లి వారపు సంతలో వ్యాపారుల అమ్మకాలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి వారపు సంత బుధవారం కళకళలాడింది. తుపాను కారణంగా సంత ఉంటుందా? లేదా? అని ఈ ప్రాంత ప్రజలు దిగులు చెందారు. అయితే సాయంత్రం సమయానికి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యాపారులు యథావిధిగా వచ్చి కూరగాయలు, ఆకుకూరలు, చేపలు, మాంసం, మసాలా దినుసుల వగైరా అమ్మకాలు సాగించారు. దీంతో నరసింగబిల్లి, చింతలపాలెం, జట్టపురెడ్డితుని, సోమవరం, ఏనుగుతుని, నూతలగుంటపాలెం తదితర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేశారు.

పంట పరిశీలనలో అధికారులు



కశింకోటలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త గౌరీకుమారి, సిబ్బంది

కశింకోట: వరి పంటను రక్షించుకోవడానికి రైతులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎంటీజీఎస్ గౌరీకుమారి సూచించారు. కశింకోట వద్ద మిచాంగ్ తుపాన్ వర్షాల వల్ల నీట మునిగిన, నేల కొరిగిన వరి పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ధాన్యం గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న చోట సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. వాటిని వర్షాలకు తడవకుండా ఆరబెట్టుకునేందుకు తగినన్ని టార్పాలిన్లు, పాలిథిన్ పట్టాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తుపాను తర్వాత ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నారు. వరి పంట కోత జరిగి, పనలు భూమిలో ఉన్నప్పుడు తక్షణమే పనలను కట్టలుగా కట్టి కుప్పపెట్టి వర్షం నుంచి తడవకుండా చూడాలన్నారు. తడిసిన పనలలో ధాన్యం మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఈ జాగ్రత్తల గురించి రైతులకు క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది అవగాహన కలిగించాలని సూచించారు. మెరక పంట మిరపలో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పచ్చి మిరప, పండు మిరపలను కోసి అధిక వర్షాల నుంచి తడవకుండా, బూజు పట్టకుండా కాపాడుకోవాలన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.శ్రీహరితో కలిసి మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, ఏఈవో ఎ.శ్రీనివాసరావు, పి.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్రా'


సబ్బవరం: గ్రామ స్థాయిలో క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారిలో పోటీతత్వాన్ని పెంపొందించాలనే సంకల్పంతోనే ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆడుదాం ఆంధ్రా బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించడంతో పాటు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ మనలో చాలా మందికి క్రీడల్లో ప్రతిభ ఉన్నప్పటికీ వారు ప్రదర్శించేందుకు వేదికలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి ఆడుదాం ఆంధ్రా ద్వారా ప్రభుత్వం ఒక వేదిక కల్పించనుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల సచివాలయాలు ఉన్నాయని, వాటి పరిధిలో ఈ క్రీడా పోటీలు నిర్వహించి, వారిలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ వంటి 5 రకాల క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లే విధంగా ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, పార్టీ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, బోకం స్వామినాయుడు, ఎంపీటీసీ బైలపూడి దేముడు, బోకం బాలకృష్ణ, ఐడీ బాబు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 104 వైద్య సేవలు


మాత్రలు అందిస్తున్న సర్పంచ్ నూకరాజు


మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి లో బుధవారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆయన పరిశీలించి, రోగులకు మాత్రలు అందజేశారు.

పుణ్యక్షేత్రాలకు ఇరుముడులతో శివ స్వాములు


శివస్వాముల పూజలు

మునగపాక: స్థానిక సాంబశివుని పీఠంలో మాలలు ధరించిన శివభక్తులు పుణ్యక్షేత్రాలు సందర్శించేందుకు బుధవారం బయలుదేరారు. వేదపండితులు సాయికుమార్ 24 మందికి ఇరుముడులు కట్టారు. గురుస్వామి మాడెం జోగారావు సారథ్యంలో వారంతా పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. వెళ్లే ముందు కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాజ్ వే పరిశీలన


దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.10 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపడుతున్న పనులకు తుపాను వల్ల ఆటంకం కలిగింది. భారీ వర్షాలకు ఆదిరెడ్డిపాలెం సమీపంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే దెబ్బతినడంతో గండి పడింది. దీంతో ఆ రోడ్డులో గుల్లేపల్లి మీదుగా ప్రయాణించే వారు ఇబ్బందులు పడ్డారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ సత్యనారాయణతో పాటు ఎంపీడీవో రమేష్ నాయుడు, సీఐ రంగనాథం తదితరులు పరిశీలించారు. ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. దెబ్బతిన్న రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.

హరిపాలెం కుల్లి కాలువ గేట్ల ఎత్తివేత


కుల్లి కాలువ గేట్లను ఎత్తుతున్న సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం కుల్లి కాలువ గేట్లను బుధవారం ఎత్తించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆవ పరిసరాల్లో నీటి మట్టం పెరుగుతున్నందున జలవనరుల శాఖ ఏఈ డీ.లోకేష్,నీటి సంఘం అధ్యక్షుడు పెంటకోట వెంకట అప్పారావు సమక్షంలో గేట్లను ఎత్తారు.